విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 15 మార్చి 2025 8 పేజీలు

ప్యాకేజీ పేరుతో మోసం

- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన వెనక్కుతీసుకోవాలి
- సొంత గనులు కేటాయించాలి
- కార్మిక సంఘాల డిమాండ్
- ఏలూరులో నిరసన

విశాలాంధ్ర-ఏలూరు/రాజమహేంద్రవరం : విశాఖ పట్నం స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు, రాజమహేంద్రవరంలో నిరసన చేపట్టారు. ఏలూరు పాత బస్టాండ్ వద్ద అంబేద్కర్ సెంటర్లో ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని, విశాఖ ఉక్కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని పెద్ద పెట్టున నినదించారు. సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్ వీడి ప్రసాద్, కే.బుచ్చిబాబు, బి.వెంకటరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో మోసపూరితంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్యాకేజీ వల్ల స్టీల్ ప్లాంట్‌కు ఎటువంటి ఉపయోగం లేదని ▶మిగతా 2లో..

రెండేళ్లలో పాలకొల్లుకు మెడికల్ కాలేజి

- రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని డయాలసిస్ కేంద్రాలు
- పాలకొల్లులో డయాలసిస్ సెంటర్ ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర - పాలకొల్లు : గత ప్రభుత్వం వైద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి, నిరుపేదల ఆరోగ్యానికి తూట్లు పొడిచిందని, నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించే లక్ష్యంగా ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అనగాని సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన డయాలసిస్ కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు, కలెక్టరు చదలవాడ నాగరాణి, ఏపీ స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ▶మిగతా 2లో..

వైభవంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

- లక్షలాదిగా తరలివచ్చిన జనసైనికులు, వీర మహిళలు
- వాహనాలతో రోడ్లన్నీ కిటకిట

విశాలాంధ్రబ్యూరో- కాకినాడ: జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడ గ్రామ వేదికగా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సభ నిర్వహణకు రాష్ట్ర ▶మిగతా 4లో

స్మార్ట్ మీటర్ల ప్రక్రియ ఉపసంహరించాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-చింతలపూడి: స్మార్ట్ మీటర్ల వలన భవిష్యత్తులో ప్రజలపై మోయలేని భారం పడుతుందని స్మార్ట్ మీటర్ల బిగింపు విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ చింతలపూడి మండల సమితి సమావేశం దొంత కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ▶మిగతా 2లో..

బార్లను తలపిస్తున్న దాబాలు

- హైవే పక్కన లీజుకు ప్రైవేటు స్థలాలు
- పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు నిలుపుదల
- ధర్మవరం దాబా వద్ద ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ప్రత్తిపాడు నుండి ధర్మవరం వరకు ఉన్న హైవే దాబాల వద్ద భారీ వాహనాలు రహదారి పక్కనే నిలుపుదల చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే పక్కన దాబాలు నిర్వహించేవారు ప్రైవేట్ స్థలాలు లీజుకు తీసుకుని హైవే నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను అధిక సంఖ్యలో నిలుపుదల చేస్తున్నారు. దాబాల వద్ద ఆగిన వాహనాలు తిరుగు ప్రయాణంలో యూటర్న్ తీసుకుని ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి వస్తుండడంతో అటుగా వస్తున్న వాహనాలు ఈ నిలిపిన వాహనాలను గమనించకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే దాబాల వద్ద రహదారి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలుపుదల చేస్తున్నా అటు హైవే అథారిటీ పోలీస్ శాఖ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

ధర్మవరంలో రైతుల పుంత మార్గాన్ని ధ్వంసం చేస్తున్న వాహనాలు

మండలంలోని ధర్మవరం జాతీయ రహదారిపై రైతుల పొలాలకు వెళ్లే పుంత మార్గం పక్కనే దాబా నిర్వాహకులు వాహనాలు నిలుపుదలకు స్థలం లీజుకి తీసుకోవడంతో ▶మిగతా 2లో..

జడ్పీ పాఠశాలకు రూ. 15.85 లక్షలతో సైన్స్ ల్యాబ్

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రు.15.85 లక్షలతో నిర్మాణం అవుతున్న సైన్స్ ల్యాబ్ భవనాన్ని ఏపీసి సమగ్ర శిక్ష డాక్టర్ పంకజ్ కుమార్, ఏఎంఓ ఆర్.రామారావు పరిశీలించారు. పాఠశాల కాంపౌండ్ వాల్, సైన్స్ ల్యాబ్ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పూర్వ విద్యార్థి పిఎల్ డెవలప్మెంట్ అధికారి కే ప్రసాద్, ఉపాధ్యాయుల సహకారంతో స్టేషనరీతో పాటు హాల్ టిక్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వై.విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు పరీక్షలు వ్రాసే విధానం , కెరియర్ గైడెన్స్ను వివరించారు.

మంచినీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్

విశాలాంధ్ర - వేలేరుపాడు : కొద్ది రోజులుగా మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న జీడిగింపు గ్రామానికి రామవరం పంచాయతీ సర్పంచ్ పిట్టా ప్రసాద్ చొరవతో సమస్య పరిష్కారమైంది. మంచినీటికి వేరే ఆధారం లేని ఆ గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ కి తెలియజేశారు. గ్రామంలో బోర్లు లేకపోవడం, వాగు నుంచి నీరు తెచ్చుకునే అవకాశం లేక సుదూర ప్రాంతం నుండి మంచినీళ్లు తెచ్చుకోవ దానికి వారు పడుతున్న ఇబ్బందులను తెలిపారు. వెంటనే అధికారులతో మాట్లాడి శుక్రవారం బోర్ వేసి మంచినీరు సరఫరా చేశారు. సర్పంచ్కు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య, మండల కార్యవర్గ సభ్యులు మడివి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉండి లయన్స్ క్లబ్కు అవార్డుల పంట

విశాలాంధ్ర -ఉండి : ఉండి లయన్స్ క్లబ్ చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 2023-24 సంవత్సరానికి గాను పలు అవార్డులు వచ్చినట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు శుక్రవారం తెలిపారు. తాడేపల్లిగూడెం శ్రీ జయగార్డెన్స్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ అవార్డులు అందుకున్నారు. విశిష్ట సేవా పురస్కారం రుద్రరాజు నరసరాజు, రూరల్ క్లబ్ ఉత్తమ అధ్యక్షులు వేగేశ్న అనంత లక్ష్మీ, ఉత్తమ కార్యదర్శి కన్నెగంటి రూత్ కళ అందుకున్నారని వారు తెలిపారు. పాస్ట్ గవర్నర్ గట్టి మాణిక్యాల రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి శేష సాయి, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ విజయకుమార్ రాజు, లక్ష్మీనారాయణ, అతిథులుగా జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, డి. శ్రీ శాంతి, పి. సుభాష్ బాబు, ఎ.సుధాకరరెడ్డి, ఎన్విఎస్ పాపారావు నాయుడు, డాక్టర్ సుబ్బారావు తదితర జిల్లాస్థాయి నాయకులు పాల్గొన్నారు.

దాబాలు (1వ పేజీ తరువాయి)

అక్కడ నిలుపుదల చేస్తున్న భారీ వాహనాలు రైతులు పొలాలకు వెళ్లే దారిని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఇటీవల పలువురు రాజకీయ నాయకులు ధర్మవరం పంచాయతీ కార్యదర్శికి, ప్రత్తిపాడు తహసీల్దార్లకు వినతి పత్రం అందించారు. జాతీయ రహదారిపై దాబాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. దాబా నిర్వాహకులు వచ్చే కస్టమర్లను ఆకట్టుకునేందుకు తిని తాగేందుకు ఏర్పాట్లు చేశారు. బయట కనిపించకుండా తెర వెనుక బాగోతంలా మద్యం అందుబాటులో ఉంచుతున్నారని సమాచారం. జాతీయ రహదారిపై మద్యం అమ్మకాలు చేయకూడదని నిబంధన ఉన్నా దాబాల వద్ద మాత్రం 24 గంటలు మందు, తిండి దొరుకుతుండడంతో యువత హైవే బాట పట్టి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్థానిక పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అనే విషయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. హైవేలో దాబాల వద్ద జరుగుతున్న చీకటి బాగోతాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపసంహరించాలి (1వ పేజీ తరువాయి)

విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నదన్నారు. కార్పొరేట్ కంపెనీ లకు కూటమి ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ఎక్కడ బిగిస్తే వాటిని పగలగొట్టండి అని చెప్పిన లోకేష్ స్మార్ట్ మీటర్లపై స్పష్టమైన వైఖరిని తీసుకొని ఈ విధానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2014-2019లో అప్పటి కూటమి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలను పూర్తిచేసి తక్షణం లబ్ధిదారులకు అందజేయాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని మే నెలలో అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం వాటిపై విధి విధానాలు తక్షణం విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భగత్ సింగ్ వర్ధంతి ఈనెల 23 నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశ వ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా ఏలూరు జిల్లాలో జరిగే ప్రచార కార్యక్రమంలో సిపిఐ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు, మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు జంగా రామచంద్రారెడ్డి ,బోడ వజ్రం, ఎస్కే జానీ, గంధం అంజమ్మ ,ఎస్.కె మస్తాన్, మం.నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తోర్లపాటి రాజు ,ఎర్రగుంటపల్లి శాఖ కార్యదర్శి ముల్లంగి కిషోర్, రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ (1వ పేజీ తరువాయి)

చైర్మన్ కె.పట్టాభిరామ్ సంయుక్తంగా ప్రారంభించారు. వందపడకల హాస్పిటల్, పాత హాస్పిటల్స్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించారు. డయాలసిస్ ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సహాయాలపై వైద్యులను ఆరా తీశారు. డయాలసిస్ పేషంట్లుతో మాట్లాడి సంతృప్తిని వ్యక్తం చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పాలకొల్లులో చేస్తున్న అభివృద్ధి పనులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకూ అనుసరణీయం, ఆచరణీయం అన్నారు. వందపడకల హాస్పిటల్ను పూర్తి చేసి ప్రారంభించేందుకు, రానున్న 2 ఏళ్ళలో పాలకొల్లు నియోజకవర్గంలో మెడికల్ కాలేజి ఏర్పాటుకు శాయ శక్తుల కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించగా,నేడు ఎన్డీఏ సర్కారు పునర్జీవం పోసిందని అన్నారు.చంద్రబాబు నిరుపేద వర్గాలకు అన్ని రకాల వైద్యసేవలు అందేలా రాష్ట్ర బడ్జెట్లో రూ. 19,264 కోట్లను కేటాయించిందని, నిరుపేద, మధ్యతరగతి కుటుం బాలకు మంచి నాణ్యమైన,ఉచిత వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏపి స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభి రామ్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆసుపత్రులు ఎలా పని చేశాయో మీరంతా గుర్తు చేసుకోవాలని,తిరుపతి రుయా హాస్పిటల్ లో 30 మంది ఆక్సిజన్ దొరక చనిపోయారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టిన విధంగా 25 లక్షల రూపాయలతో యూనివర్సల్ హెల్త్ స్కీమ్ తీసుకు వస్తున్నామని దీనివలన ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఆరోగ్య భీమా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, మాజీ శాసనమండలి సభ్యులు అంగర రామ్మోహన్, ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి.భానూనాయక్, డిసిహెచ్ డా.పి.సూర్యానారాయణ, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, హాస్పిటల్ సూపరింటెండెంటు డాక్టర్.ఓ. రవికుమార్, జిల్లా బిజెపి అధ్యక్షులు అయినంపూడి శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

మోసం (1వ పేజీ తరువాయి)

విమర్శించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పథకం ప్రకారం స్టీల్ ప్లాంట్ను నష్టాల్లోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయిస్తే ముడి ఇనుప ఖనిజం టన్ను రు.1000కే వస్తుందని, కానీ ప్రస్తుతం టన్ను ముడి ఇనుప ఖనిజాన్ని రు.6000-8000 కు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఫలితంగా నష్టాల్లోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 32 మంది ఆంధ్రుల ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటు వారికి కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం దుర్మార్గంగా కుట్రలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ను సెయిల్లో విలీనం చేయడానికి, సొంత గనులు సమకూర్చడానికి గాని మోదీ ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. తెలుగుదేశం మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వాన్ని చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కనీసం ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బీజేపీపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, భజంత్రీ శ్రీనివాస్, కే.కన్నయ్య, అప్పలరాజు, పి.కన్నబాబు సిఐటియు నాయకులు జి.రవి కిషోర్, ఐ వి సుధాకర్, వైయస్ కనకారావు, కె. విజయలక్ష్మి, టిటిఆర్ దొర, జాన్ బాబు, పి ఆదిశేషు, మొహిద్దీన్, కుమార్, ఎస్ఎన్ రమేష్, ఇఫ్టియు నాయకులు యర్రా శ్రీనివాస్ రావు, గడసాల రాంబాబు, పల్లి గంగరాజు, గడసాల వెంకటరమణ, కోరాడ అప్పారావు, ఎన్. అప్పారావు, జగ్గవరపు రమణ, మంగరాజు రాము తదితరులు నాయకత్వం వహించారు.

రాజమహేంద్రవరం : రాజమండ్రి, గోకవరం, అనపర్తి, కోరుకొండ ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలు తెలియజేశారు. రాజమహేంద్రవరంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును కార్పొరేట్ వ్యక్తుల కోసం నష్టాలు చూపుతున్నారని అన్నారు. విశాఖ స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకుంటున్నామని పార్లమెంటులో మోదీ తెలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, జట్ల సంఘం కార్యదర్శి రమణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లావణ్య, సిపిఎం నాయకులు పవన్, సిఐటియు నాయకులు ఎస్ ఎస్ మూర్తి, సిపిఐ ఎంఎల్ నగర కార్యదర్శి జై తులసి, రామకృష్ణ, రామారావు, నాగేశ్వరరావు, జ్యోతి రాజు, రామిరెడ్డి, రాజా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆఫ్ ఇండియా సర్వే

విశాలాంధ్ర-లింగపాలెం: సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా సర్వే నిర్వహిస్తున్నారు. లింగపాలెం మండలంలో జరిగిన సర్వేపై సర్వే ఆఫ్ ఇండియా డిపార్ట్మెంట్ సర్వేయరు వి.ప్రసాద్, తహసిల్దార్ ప్రసాద్, లింగపాలెం మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగబాబులతో సమీక్ష నిర్వహించారు. ఈ సర్వేకి సంబంధించి సర్వే ఆఫ్ ఇండియా సర్వేయరు పలు విషయాలు వెల్లడించారు. దేశంలో 50 ఏళ్ల క్రితం ఇటువంటి సర్వే నిర్వహించడం జరిగిందని అప్పటిలో జరిగిన సర్వే ప్రకారం మ్యాపులలో గ్రామాల పేర్లను నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజల అభిప్రాయం మేరకు రెండు,మూడు ఇళ్లు ఉన్న ప్రాంతాలను గ్రామాలుగా గుర్తిస్తున్నామని ఈయన తెలిపారు. గ్రామాలకు సంబంధించిన సరైన వివరాలు సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్లో పొందుపరుస్తామని అన్నారు.ఏలూరు జిల్లాలో సర్వే పూర్తి కావచ్చిందని ఈయన తెలిపారు.తహసిల్దార్ ప్రసాదు,రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబుతో సర్వేకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు.

ధ్యానంతో ఒత్తిడిని అధిగమించవచ్చు

విశాలాంధ్రతో విశ్రాంత ఐఏఎస్ అధికారి

విశాలాంధ్ర-లింగపాలెం: ఒత్తిడితో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ, అనుకున్న లక్ష్యాన్ని అందుకోలేని పరిస్థితుల్లో ధ్యానం వల్ల మంచి విజయాలు సాధించవచ్చని లింగపాలెంకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి తెలిపారు. కాలాను గుణంగా ఎదురైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ధ్యానం ఉపయోగపడుతుందని భావించిన ఈయన ధ్యానం వైపు ప్రజలను మళ్లించేందుకు తన వంతు ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. లింగపాలెంకు చెందిన ఈయన ధ్యానంపై అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సొంత గ్రామంలోని ప్రజలకు తన వంతు సేవలు అందించాలనే లక్ష్యంలో భాగంగా లింగపాలెంలో ధ్యాన తరగతులను నిర్వహించారు. అనేక మందికి ధ్యానంపై ఆసక్తి కల్పించారు. ఈ సందర్భంగా ఈయన విశాలాంధ్రతో తన అనుభవాలను పంచుకున్నారు. తనకు వివిధ సందర్భాలలో అనారోగ్య సమ స్యలు ఎదురైనప్పుడు సన్నిహితులు ఇచ్చిన సలహా మేరకు ధ్యానం చేయటం అలవాటు చేసుకున్నానని ఇది మంచి ఫలితం ఇచ్చిందని అన్నారు. స్వగ్రామంలోని ప్రజలను ధ్యానం వైపు మళ్ళించాలనేది తన సంకల్పమని ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు.

వేసవిలో ప్రత్యేక క్యాంపు: వేసవి సెలవులు ఇవ్వగానే విద్యార్థుల కోసం లింగపాలెంలో కెరియర్ ప్లస్ధ్యానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. శాస్త్రీయమైన విధానంతో శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

మంత్రికి పరామర్శ

విశాలాంధ్ర- లింగపాలెం: యాక్సిడెంట్ నుంచి కోలుకొని స్వగ్రామమైన భీమవరానికి వచ్చిన నరసాపురం పార్లమెంట్ సభ్యులు, కేంద్ర ఉక్కుభారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసశర్మను ఏలూరు జిల్లా బిజెపి అధ్యక్షులు చవటపల్లి విక్రమ్ కిషోర్, లింగపాలెం మండలానికి చెందిన కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాయంకుల చక్రధరరావు, బిజెపి నాయకులు కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, చింతలపూడి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లె శీను తదితరులు పరామర్శించారు.

చిరస్థాయిగా కార్ల్‌మార్క్స్ రచనలు

విశాలాంధ్ర -భీమవరం: రష్యన్ విప్లవ ప్రభావం భారతదేశంలో జరుగుతున్న జాతీయ ఉద్యమం మీద ఎంతో ప్రభావం చూపించిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, న్యాయవాది మల్లుల శ్రీనివాసరావు అన్నారు. కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతిని సిపిఐ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ ఫొటోకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రష్యన్ విప్లవ ప్రభావంతో 1920లో కార్మిక వర్గాన్ని సంఘటితపరిచి అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీ ఏర్పడిందన్నారు. 1923లో తొలి మేడేను మద్రాస్‌లో సింగారువెల్‌శెట్టిఆర్ నిర్వహించి ఎర్రజెండాలు మొదటిసారి ఎగరవేశారన్నారు. కార్మిక సంఘాలతో పాటు వివిధ ప్రజాసంఘాలు నిర్మించి ప్రజలను భాగస్వామ్యం చేశారన్నారు. మార్క్స్ పేరు యుగ యుగాలుగా నిలిచిపోతుందని ఆయన కృషి ఆయన విలువలు, రచనలు, ఆయన ఆలోచన విధానాలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని వారు పేర్కొన్నారు.

టి నరసాపురంలో ఘనంగా హోలీ వేడుకలు

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం విజన్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో హోలీ పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అన్ని సమాజాలను కలిపి కుల, మత, వర్గ భేదాలు లేకుండా ఇంద్ర ధనుస్సుగా ఏకం చేసే పండుగ హోలీ అన్నారు. మానవ జీవితంలో కష్టాలన్నీ పోయి సుఖ సంతోషాలతో ఆనందోత్సాహాలతో రంగులు పూసుకొని జరుపుకొనే పండుగ హోలీ అన్నారు. కొన్నిచోట్ల వసంత ఋతువుకు ఆరంభ సూచికగా హోలీ పండుగను జరుపుకుంటారని ఆయన తెలిపారు. హోలీ పండుగ రోజున ప్రతి ఒక్కరూ సహజమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని ఆయన సూచించారు. కృత్రిమ రంగులతో చర్మ వ్యాధులు వ్యాపించే ప్రమాదం వుందని, వాటికి దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పలు పాఠశాలల విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 15 నుంచి 21 వరకు కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ భీమవరం కాస్మో పాలిటీన్ క్లబ్‌లో నిర్వహిస్తున్నామని క్లబ్ కార్యదర్శి పెన్మెత్స వెంకట రామరాజు, వి.వి.సుబ్రహ్మణ్య వర్మలు తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వారు వెల్లడించారు. వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) ఎండి వివిఆర్ వర్మ, తమ క్లబ్ సభ్యుల ఆర్థిక సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, మెన్స్ ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ 35ం, 45ం, 55ం,65ం, 70ం,75ం జరుగుతాయని తెలిపారు. భీమవరంలోని కాస్మో, ఎల్ హెచ్ టౌన్ హాల్, డిఎన్నార్, ఎస్ఆర్ కేఆర్ కళాశాల క్రీడా మైదానంలోని 8 కోర్టుల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, పలు రాష్ట్రాల నుంచి 220 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. 16న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, పిఏసి చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) ఎండి వివిఆర్ వర్మలు టోర్నమెంట్ ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో ఎం.సుబ్బరాజు, యుఆర్ పిఆర్ వర్మ, ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

విశాలాంధ్ర -భీమవరం: ఇళ్లు, ఇళ్ల స్థలాలపై కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో తాడేరు గ్రామంలో ఇళ్లులేని నిరు పేదలతో ఇళ్ల స్థలాలకై వ్యక్తిగత అర్జీలను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా కలిశెట్టి మాట్లాడుతూ ఇళ్ల స్థలాల అర్జీదారులతో ఈ నెల 15 వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, వ్యక్తిగత దరఖాస్తులను కలెక్టర్ కు అందచేస్తామని పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలిరావాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఒక పక్క మరో పక్క అద్దెలు కట్టకోలేక పేదలు ఇబ్బంది పడ్తున్నారని, వారి ఆదాయంలో సగం ఇంటి అద్దెలకు పోతుందని కలిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న నివేశనా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు కూడా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతీ పేద కుంటుంబం ఇంటి స్థలం పొందే వరకు పోరాటం నిర్వహిస్తామని దశలవారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు మల్లుల శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి నాయకులు ఛాన్ భాషా, పెద్ద సంఖ్యలో అర్జీదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రఘురామ

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్, ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు శుక్రవారం పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలవేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్య రంగంలో కీలక మార్పులు తీసుకువచ్చి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వెయ్యడానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను సమూలంగా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే తన నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో దాతల సహకారం, ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు అందించటమే లక్ష్యం

విశాలాంధ్ర-వీరవాసరం: వీరవాసరం కళా పరిషత్ సాహితీ కళా సేవలతో పాటు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఆశయంతో పనిచేస్తుందని కళాపరిషత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ అన్నారు. వీరవాసరం కళాపరిషత్ ఆధ్వర్యంలో భీమవరం మిత్ర మెడికేర్ హాస్పిటల్ వారిచే స్థానిక పాత స్నేహ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కర్రి ప్రశాంత మాట్లాడుతూ తాను పుట్టిన ఊళ్లో వైద్య సేవలు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరి ఆహారపు అలవాట్లు క్రమశిక్షణతో ఉండాలని రోజూ ఎండ తగిలే విధంగా చూడాలన్నారు. ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ కాకులపాటి శ్రీవర్ధన్ మాట్లాడుతూ ఎముకలు గట్టితనంకు మంచి పోషకాహారాలు తీసుకోవాలన్నారు. క్యాంప్ మేనేజర్ బి. శ్రీనివాస్ పర్యవేక్షించారు. అనంతరం కళాపరిషత్ సభ్యులు డాక్టర్లను ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో మద్దాల శివాజీ, గ్రంధి కిషోర్, జద్దు పద్దయ్య, గోపా సురేష్, గుండా గోపాల్, గునిశెట్టి ప్రసాద్, గిల్లి సుబ్బారావు, పంజా సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం ఆవిర్భావ సభకు తరలి వెళ్ళిన జనసైనికులు

విశాలాంధ్ర-టి నరసాపురం: పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ సభకు జనసేన పార్టీ మండల అధ్యక్షులు అడపా నాగరాజు ఆధ్వర్యంలో జనసేన శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్ళినట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటన లో తెలిపారు తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జనసైనికులు బస్సులు, కార్లలో తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళా పోలీస్ అధికారికే లేని రక్షణ సామాన్య మహిళకు ఉంటుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు విచ్చలవిడిగా మద్యం అమ్ముతూ ఉంటే అవి తాగిన యువత మహిళా పోలీస్ మీద కూడా దాడి చేసే విధంగా అసభ్యకరంగా మాట్లాడుతూ ఉంటే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షించే విభాగంలో ఉన్న మహిళలకు కూడా రక్షణ లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇటీవల విజయనగరంలో మహిళా ఎస్సై పై జరిగిన దాడి దీనికి నిదర్శనం అన్నారు. మద్యాన్ని నియంత్రించడం ద్వారానే దాడులు అరికట్టవచ్చు అన్నారు. ఈ దాడులన్నీ మద్యం మత్తులోనే జరుగుతున్నాయన్నారు. మద్యాన్ని విక్రయించేది ప్రభుత్వాలే కాబట్టి మహిళలపై జరుగుతున్న దాడులకు పరోక్షంగా ప్రభుత్వమే కారణమవుతుందన్నారు. ప్రభుత్వాలు తక్షణమే మద్యం షాపుల నియంత్రణ చేయాలని, లేనిపక్షంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ఫోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - భీమవరం: ఫోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా 18 ఏళ్ల లోపు బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్త వహించాలని, మాయమాటలు చెప్పి ప్రలోభాలు చూపించి మోసం చేయాలనే ఉద్దేశంతో ఉంటారని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు అన్నారు. ఫోక్సో చట్టంపై అవగాహన శుక్రవారం ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలనీ, సెల్ ఫోను విజ్ఞానానికే వినియోగించుకోవాలని, సెల్‌ఫోన్ విచ్చలవిడిగా వాడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైన అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే హాస్టల్ వార్డెన్ కి గానీ, పోలీసు వారికి గానీ, మండల న్యాయ సేవా సంస్థ దృష్టికి గానీ తీసుకువస్తే వారిపై చర్యలు తీసుకుంటారని న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎన్.సుధీర్, పి.అంబేద్కర్, బి.లోకేశ్వరరావు, కె.జ్యోతి, పారా లీగల్ వాలంటీర్ వి.శ్రీలక్ష్మి, హాస్టల్ వార్డెన్ ఆర్.జయంతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకూ న్యాయం జరగాలి

విశాలాంధ్ర -భీమవరం: న్యాయ వ్యవస్థ గౌరవాన్ని ఇనుమడింప చేసేలా న్యాయ విద్యార్థులు కృషి చేయాలని, కడు పేదవానికి కూడా న్యాయం అందేలా శ్రమించాలని డిఎన్నార్ విద్యా సంస్థల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహారాజు అన్నారు. డిఎన్నార్ న్యాయ కళాశాల 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎందరో న్యాయవాదులుగా, జ్యుడిషియల్ ఆఫీసర్లుగా సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిఎన్నార్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణ రాజు, పాలక వర్గం సభ్యులు యం.వి. కృష్ణంరాజు, దత్తాత్రేయ వర్మ, బంగారు రాజు, ఏ.ఓ., పి. రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురాం వైస్ ప్రిన్సిపాల్ అశోక్ కుమారు, అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.



దాత చొరవతో మంచినీటి సదుపాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు దాహార్తిని తీర్చడానికి మానవతా దృక్పథంతో మంచినీటి ట్యాంకులను లక్ష్మీ ట్రైలర్ శ్రీనివాస్ సొంత ఖర్చులతో నిర్మించడం హర్షించ దగ్గ విషయమని పరిపుడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. మండలంలో గవరవరం గ్రామపంచాయతీ పరిధి వెంకయ్యపాలెం గ్రామ శివారు కాలనీవాసులు త్రాగడానికి మంచినీరు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సిపిఐ ఆధ్వర్యంలో మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేయగా, కాలనీకి చెందిన లక్ష్మీ ట్రైలర్ కర్రి శ్రీనివాస్ , అతని కుమారుడు కార్తీక్ జ్ఞాపకార్థం ప్రజల దాహార్తిని తీర్చడానికి మంచినీటి ట్యాంకులను ఏర్పాటు చేసి, శ్రీ సత్య సాయి గోదావరి మంచినీరు ప్రజలకు సరఫరా అయ్యేలా కనెక్షన్లు ఇచ్చారు. నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకులను సర్పంచ్ విజయ కుమారి శుక్రవారం ప్రారంభించారు. శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణారావు, చెప్పుల మధుబాబు, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప అంజనేయరాజు, జనసేన పార్టీ నాయకులు దుగ్గిన శ్రీనివాసరావు, ముప్పిడి చినబాబు, సంకు కృష్ణ, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలి

విశాలాంధ్ర -భీమవరంటౌన్ : గణితాన్ని ఇష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని గణిత ఉపాధ్యాయులు పూడి కోటేశ్వర రావు, రేపాక వెంకన్న బాబు అన్నారు. శుక్రవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించి గణిత ఉపాధ్యాయులను సత్కరించారు. వారు మాట్లాడుతూ గణితమంటే భయపడనవసరం లేదని, శ్రద్ధగా సాధన చేస్తే విద్యార్థులు ఉన్నత శిబిరాలను అధిరోహిస్తారని అన్నారు. ఎం. శ్రీనివాసరావు, జే శకుంతల మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఒక్క గణితంలో పట్టు సాధిస్తే అన్ని రంగాల్లోనూ రాణించవచ్చునని అన్నారు. అనంతరం నలుగురు గణిత ఉపాధ్యాయులను సత్కరించారు.

ఘనంగా గుబ్బల మంగమ్మ జాతర

విశాలాంధ - బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ జాతర మహోత్సవాలను గిరిజన సంప్రదాయాలతో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మూడు సంవత్సరాల క్రితం నిర్వహించిన ఈ జాతరను కామవరం పీఠాధిపతి పుల్లారావు సూచన మేరకు ఈ సంవత్సరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ జాతర మహోత్సవంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, మాజీ పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు పాల్గొని భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్ద జాతర మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దళిత ఉద్యోగులంతా సంఘటితం కావాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ప్రస్తుత పరిస్థితుల్లో దళిత ఉద్యోగులంతా సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి. రత్న ప్రదీప్ అన్నారు. శుక్రవారం భీమవరం బిఆర్ అంబేద్కర్ భవనంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా, మండల,నూతన, కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులు కె.రాజ్ కిషోర్ (తహశీల్దార్), సెక్రటరీ ఎస్. శ్రీకర్, వైస్ ప్రెసిడెంట్ బి. జ్యోతి, ట్రెజరర్ జి. కృష్ణ మోహన్, మండల అధ్యక్షులుగా వి. రాజేష్ కుమార్, సెక్రటరి కే గౌతమ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పి.రాజేష్, ట్రెజరర్ పి. సుధీర్ బాబు సభ్యులను ఎన్నుకున్నారు. ముందుగా అంబేద్కర్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రత్న ప్రదీప్ మాట్లాడుతూ దళిత ఉద్యోగులు ఐక్యంగా ఉండి, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను ఈ అసోసియేషన్ లో చేర్పేలా కృషి చేయాలని, ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆర్.రాంబాబు, జి మురళీ కృష్ణ, కే శ్రీనివాసరావు, కేసి రాజు, కోనా జోసెఫ్, గంటా సుందర్ కుమార్, ఎస్ సలీం రాజు, జె.ఏసు బాబు, విల్సన్, ఎం.కాళి, మానస, మహంకాళి, జి జక్రయ్య, ఎ. లలిత కుమారి, డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి

విశాలాంధ్ర - పెంటపాడు : పంచాయతీ కార్యదర్శుల పై పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శుల సంఘం తరపున రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దేవబత్తుల నాగదేవి, మండల నాయకులు ఎంపీడీవో సిహెచ్ బాలాజీ వెంకటరమణ, ఈవోపీఆర్డి వై.వి.రమణకు వినతి పత్రం అందం చారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగదేవి మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో పంచాయతీ వ్యవహారాలు చూసుకుంటూనే, సచివా లయ సిబ్బంది చేయాల్సిన పనులను కూడా ఏకకాలంలో మోనిటరింగ్ చేయడం వలన తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నా మని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన ఈ-సచివాలయ వ్యవస్థను నడపడానికి మేము సిద్ధంగా ఉన్నామని, దీనికి కావలసిన క్రింది స్థాయి సిబ్బంది అయిన సచివాలయ సిబ్బంది మాత్రమే కాక, ఉన్నతాధికారులు కూడా సహకరిస్తే తమ ఉద్యోగ బాధ్యతలు సాఫీగా సరళముగా చేసుకోవడానికి వీలుపడుతుందని, నాగదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు కార్యదర్శుల సంఘం నాయకులు జి. బాలకృష్ణ, ఎం. శేఖర్ బాబు, శోభన్ కుమార్,ఫణి కుమార్, ఎం శ్రీనివాసరావు, డి. అప్పారావు, శకుంతల, ఇలియాస్ బేగ్, కొండలరావు, ఆనంద్, శిరీష, రాధా, మనీషా, సుధా తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం

(1వపేజీ తరువాయి)

పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సారథ్యంలో గత పది రోజుల నుండి జిల్లా, ఇతర జిల్లాల నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఉదయం నుండి లక్షలాదిగా తరలివచ్చిన జనసైనికులు, వీర మహిళలు, జనసేన అభిమానులు, నాయకులతో సభ ప్రాంగణం కిటకిటలాడింది. నాలుగు గంటలకు సభ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ రాష్ట్రాల కళాకారులచే నిర్వహించారు. జనసేన ప్రస్థానం ఏవీలను వీడియోల ద్వారా వేదిక మీద ప్రదర్శించారు.

అనంతరం జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, వీర మహిళలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు వేదికపై 250 మంది ఆశీనులు కాగా ఎమ్మెల్యేలకు, చైర్మన్లకు మాట్లాడే అవకాశం కల్పించారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు కొణిదల నాగబాబు మాట్లాడుతూ జగన్ రెడ్డి నిద్రమత్తులో ఉన్నాడని అన్నారు. మరో 20 సంవత్సరాలు అదే మత్తులో ఉండాలని పేర్కొన్నారు. జనసేన కూటమి ప్రభుత్వం మరో 20 సంవత్సరాల వరకు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టబోతుందని అన్నారు. ఈ తొమ్మిది నెలల్లో చేసిన అభివృద్ధి చాలా తక్కువ అని ఇక ముందు చేయాల్సింది చేసి చూపుతారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గొప్ప నాయకుడని, ఆయనలా పోరాటాలు చేయటం అందరికీ సాధ్యం కాదని అన్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలుపునకు పవన్ కళ్యాణ్, పిఠాపురం జనసైనికులు, ప్రజలు, ఓటర్లే తప్ప ఏ ఒక్కరూ కాదని పరోక్షంగా టిడిపి మాజీ ఎమ్మెల్యే వర్మకు చురకలంటించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ వివరించారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం చేపట్టి చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పేదవాడి కంటినీరు తుడిచేదిశగా పవన్ కళ్యాణ్ పని చేశారని అన్నారు. 11 సంవత్సరాల పాటు ఆయన నిర్విరామంగా కృషి చేశారని తెలిపారు. తాను మంత్రిగా కీలక శాఖలకు ఉన్నానంటే కారణం పవన్ కళ్యాణ్ అని దుర్గేష్ అన్నారు. పవన్‌కళ్యాణ్ తను పని చేస్తున్న శాఖల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిలబడిన అన్ని సీట్లు గెలవడం అంటే చిన్న విషయం కాదని, దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు జనసేనను అభినందిస్తున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వాల్ని ప్రజలు స్వాగతిస్తున్నారని దుర్గేష్ పేర్కొన్నారు. లక్షలాదిమంది ప్రజలకు జనసేన నిర్వహణ కమిటీ సభ్యులు అన్ని రకాల వసతులను సమకూర్చారు. భోజనాలు, మజ్జిగ ,స్నాక్స్, పుచ్చకాయలు తదితరాలను ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా వినతులు అందించేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి వారికి భరోసా కల్పించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజా సమస్యల పరిష్కారాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్నామన్నారు. దీంతో ఏలూరు నియోజకవర్గంలో తిష్టవేసిన అనేక జటిల సమస్యలు పరిష్కారమవ్వడంతో పాటూ ప్రజల దశాబ్దాల కలలెన్నో సాకారమయ్యాయన్నారు. అలాగే మరిన్ని సమస్యల పరిష్కారానికి రానున్న కాలంలో పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

పవన్ ఆదేశాలే జన సైనికులకు శిరోధార్యం

ఏలూరులో ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలే జన సైనికులకు శిరోధార్యమని, ఏలూరు పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల జన సైనికులను సమైక్యం చేస్తూ క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గాల సమన్వయకర్త, ఏలూరు జనసేన ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు అన్నారు. 12వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల సమక్షంలో జనసేన పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అప్పల నాయుడు మాట్లాడుతూ ఎన్నో అవరోధాలు, అవమానాలు, వైరి వర్గాల అవహేళనలు, దశాబ్ద కాలానికి పైగా ఎదురొచ్చిన కష్టాలను అధిగమించి కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ నిర్వహిస్తున్న 12వ ఆవిర్భావ దినోత్సవం విజయోత్సవ సంబరాన్ని సంతరించుకుందన్నారు. స్థానిక 27వ డివిజన్ చొదిమెళ్ళలో డివి జన్ ఇంచార్జ్ బెజవాడ నాగభూషణం కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి రెడ్డి అప్పల నాయుడు హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. తదనంతరం మినీ బైపాస్ రోడ్డులో ఉన్న కాస్మో క్లబ్ వద్ద నుండి రెడ్డి అప్పల నాయుడు ఆధ్వర్యంలో 130 కార్లతో భారీ ర్యాలీగా పిఠాపురం ఆవిర్భావ దినోత్సవ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, వివిధ హోదాల్లో ఉన్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హోలీ

విశాలాంధ్ర - ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హోలీ ఘనంగా జరిగింది. గ్రామపంచాయతీ కార్యదర్శి బొడ్డు రవిచంద్ర కుమార్, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు హోలీ పండుగను జరుపుకున్నారు. ఒకరికి ఒకరు రంగులు వేసుకొని హ్యాపీ హోలీ పండుగ అంటూ నినాదాలు చేశారు. హోలీ పండుగ ఎంతో ఆనందంగా ఉందని పారిశుధ్య కార్మికులు అన్నారు. చింత చెట్టు రోడ్లో పిల్లలు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో హోలీ పండుగ జరిగింది.

మెగా క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామంలో టేకుమూడి వీవెం సత్యన్నారాయణ ఆధ్వర్యంలో దాట్ల సుబ్బరాజు (డియస్ఆర్) మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా రెండవ రోజు జరిగిన మ్యాచ్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన క్రీడాకారుడికి రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి మెమొంటో అందజేశారు. అదేవిధంగా హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేయు ఉద్దేశంతో క్రికెట్ లో పాల్గొన్న ఆటగాళ్ళు అందరికి లాటరీ నిర్వహించి అందులో వచ్చిన వారికి హెల్మెట్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో జక్కల ప్రసాద్ బాబు, నిమ్మకాయల మూర్తి, వడ్లమూడి సతీష్, కొప్పిశెట్టి సతీష్, ఊడా వెంకటరమణ, బండారు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్న మెంట్లో విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానోత్సవం ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, యంపి గంటి హరీష్ మాధుర్, రాజ్యసభ సభ్యులు సాన సతీష్, యంయల్సి పేరాబత్తుల రాజశేఖరం పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కాత్రేనికోన : చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల ఎస్ఎన్ఎస్ విద్యార్థులు వారం రోజుల స్వచ్ఛంద సేవా శిబిరంలో భాగంగా దత్తత గ్రామమైన చెయ్యేరు గ్రామంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సమాజమునకు ప్రయోజనం చేకూరేలా సమాజసేవ, దంత సమస్యలపై అవగాహన కల్పించుట, నైపుణ్యాభివృద్ధి వంటి సేవా కార్యక్రమములు చేపట్టారు. ఈ కార్యక్రమమును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాస కుమార్ ప్రారంభించారు. చెయ్యేరు గ్రామా న్ని దత్తతతీసుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులైన విద్యార్థులు సమాజ అవసరాల కనుగు ణంగా ఆరోగ్యం, పారిశుధ్యం, గ్రామంలో పచ్చదనం వెల్లి విరిసేలా కార్యక్రమములు చేపట్టారన్నారు. గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

మాదవ్‌ను ముద్రగడ పరామర్శ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జీ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. ఇటీవల కాలంలో రోడ్ ప్రమాదంలో గాయపడ్డ వాగు బలరాం సోదరుడు వాగు మాధవ్‌ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. మాధవ్‌ను త్వరగా కోలుకోవాలన్నారు. గిరిబాబు మాట్లాడుతూ మండలంలో వైసీపీ పార్టీని బలోపేతం చేసి పార్టీని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్, సుంకర రాంబాబు, సామంతుల సూర్య కుమార్, గోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ధర్మవరం గ్రామంలో తాగునీటి కష్టాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వేసవి ప్రారంభం కావడంతో చర్యలు చేపట్టాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల అడ్రస్ తెలియడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు సంబంధించిన పైపులైన్లు వారానికి రెండుసార్లు మరమ్మతులకు గురవుతుందని ఈ ట్యాంక్ ద్వారా వచ్చే తాగునీటికి గ్రామంలో సగం జనాభా ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పెద్ద ట్యాంకు సంబంధించిన అండర్ గ్రౌండ్ పైపులైన్లు సుమారు 2001వ సంవత్సరంలో సిమెంట్ పైపు లైన్లు వేసారని అప్పటినుంచి ఇప్పటివరకు ఆ పైపు లైన్లు మార్చుకపోవడంతో తరచూ అవి భూమిలో పాడైపోయి ప్రజలకు కలుషిత నీరు వస్తున్న సందర్భాలు ఉన్నాయని , గ్రామ రెండవ వార్డు సభ్యుడు గొనగాని పద్మ గోపి ఆరోపించారు. తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు మొరపట్టుకోగా ఈమధ్య స్పందించి మరమ్మతులు చేశారని వారం గడవక ముందే మళ్లీ పైపులైన్లు పగిలిపోవడంతో సమస్య యధాతధంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పనితీరుపై సర్వత్ర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యపై సత్వరమే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉచిత మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని రౌతుపాలెం గ్రామసర్పంచ్ కొంగన రాణి కుమార్ స్వామి, మాజీ ఎంపీటీసీ నిమ్మల రాంబాబు ఆధ్వర్యంలో కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పిటల్ వారిచే ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ స్వామి మాట్లాడుతూ గ్రామంలో ఎంతో మంది వృద్ధులు, పిల్లలు అనారోగ్యంతో ఉన్న ఆసుపత్రికి వెళ్లి చూపించుకోలేని ఎంతోమంది పెదకుటుంబాలకు అండగా ఉండాలనే స్వదుద్దేశంతో ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించామని, ఇలా మార ుమూల గ్రామాలలో ఇలాంటి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం వల్ల ఆరోగ్యంపై అవగాహనా ఏర్పడు తుందని, ఇలాంటి కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా చేయాలన్నదే మా ఉద్దేశం అన్నారు. ఈ

మెడికల్ క్యాంప్‌లో బీపీ, షుగర్, ఈసీజీ వంటి టెస్టులు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. మా గ్రామానికి వచ్చి ఇంతటి సేవని అందించిన సూర్య గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారికీ ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మల పద్మరాజు, కోలా వీర్రాజు, కుందల శ్రీను, సిరిబోలు ఏసుబాబు, ఉమ్మిడి బాబ్జి, కొర్ని ప్రకాష్, బేనుకం సాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల దీక్ష

విశాలాంధ్ర - రావులపాలెం : ఆమలాపురం ఆర్టీసీ డిపోలో సర్వీస్ చేసే డ్రైవర్ బివిఎస్ నారాయణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం ఏపీ బీఎండబ్ల్యు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు దీక్ష చేపట్టారు. 1/19 రూల్‌ను పూర్తిగా డిపోలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో కార్యదర్శి బి నేబు ఆధ్వర్యంలో దీక్ష కొనసాగింది. ఈ దీక్షలో ఆర్టీసీ కేఎస్ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల కోసం

పోరాడతామని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన చేపట్టి తమ డిమాండ్ల సాధనకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం డిపో అధ్యక్షుడు బివిఎస్ నారాయణ, జోన్ అసిస్టెంట్ సెక్రటరీ వివిఎస్ నారాయణ, ఇతర ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రొయ్యలు యూనిట్ నిర్మాణంకు అనుమతిపది ... గ్రామస్తుల ఆందోళన

విశాలాంధ్ర - కాత్రేనికోన : ప్రభుత్వ అనుమతులు లేకుండా, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా దొంతికుర్రులో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దొంతికుర్రు గ్రామానికి ఆనుకుని పల్లం వెళ్లే రహదారికి పక్కన ఈ నిర్మాణం జరుగుతోంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గతంలో ఆందోళన చేశారు. దీంతో నిర్మాణ పనులను నిలిపివేశారు. మరలా తిరిగి నిర్మాణ పనులను మొదలుపెట్టారు. శుక్రవారం నుంచి స్లాబ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రాసెసింగ్ యూనిట్ వల్ల తమ పంటలు నాశనం అయిపోతాయని, గ్రామంలో నివాసం ఉండలేమని దుర్వాసన వెదజల్లుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ చేసిన అధికారులు యూనిట్ యాజమాన్యానికి వత్తాసు పలికారు. దీని వెనుక భారీగా ముడుపులు అందాయ న్న ఆరోపణలు గ్రామ ప్రజల నుండి వినపడుతున్నాయి. రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ పనులు నిలుపుదల చేయకపోతే ఆందోళన చేపడుతామని బాధిత గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ముగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

విశాలాంధ్ర - కడియం : తూర్పుగోదావరి జిల్లా పిఎం శ్రీ పాఠశాలల స్కౌట్స్ అండ్ గైడ్ పెట్రోల్ లీడర్స్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఏపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కడియం ప్రధానోపాధ్యాయులు మరియు క్యాంపు డైరెక్టర్ టి సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా స్కౌట్ కార్యదర్శి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఐదు రోజుల శిక్షణా తరగతులు ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతం చేసినందుకు పాఠశాల సిబ్బందికి, జిల్లా విద్యాశాఖ తరపున అభినందనలు తెలిపారు. క్యాంపు ఆర్గనైజర్ గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి సహాయపడిన ఎంపీపీ వెంకట సత్యప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, మినర్వా వెంకటేశ్వరరావు, పల్ల వెంకన్న నర్సరీస్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. స్కౌట్ మాస్టర్ ట్రైనీస్ నారాయణమూర్తి, బ్రహ్మేశ్వరరావు, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులకు సత్యనారాయణను, స్కౌట్ ఉపాధ్యాయులు జి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, గైడ్ టీచర్ గిరిజ, సహాయ ఉపాధ్యాయిని రాఘవ కుమారిలను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

టివి రామారావుకు అరుదైన గౌరవం

విశాలాంధ్ర కొవ్వూరు : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావుకు అరుదైన అవకాశం లభించింది. అదేమిటంటే శుక్రవారం కాకినాడ జిల్లా చిత్రాడలో జరిగిన జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవంలో రామారావుకు స్టేజి మీదకి ఆహ్వానించే కమిటీలో సభ్యునిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామారావు చిత్రాడ నుంచి ఫోన్లో విశాలాంధ్ర విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పార్టీ అధినేత తనను రాష్ట్ర పార్టీ సాంస్కృతిక విభాగం సభ్యునిగా నియమించిందని అదేవిధంగా ఇంతటి చారిత్రాత్మక సభలో తనకి గౌరవం దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఆనందోత్సాహాల మధ్య హోలీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మనుషుల్లో కుల మతం భేదం లేకుండా అందరూ సామాన్యంగా జరుపుకునే పండుగలలో ఒకటైన రంగులు పండుగ హోలీని ఏలేశ్వరంలో చిన్నారులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేశమంతటా రంగుల పండుగను నిర్వహిస్తున్న సందర్భంగా సెలవు దినంగా హోలీ పండుగను చిన్నారులతోపాటు పెద్దలు ఈ రంగుల పండగలో పాల్గొన్నారు. తమ జీవితాల్లో రంగులమయం కావాలని చిన్నారుల నుండి పెద్దల వరకు హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. హ్యాపీ హోలీ సందర్భంగా గ్రామ ప్రజలకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

తరలిన జనసైనికులు

విశాలాంధ్ర - కడియం : మండల కేంద్రమైన కడియం బొబ్బిలి బ్రిడ్జి సెంటర్ వద్ద జనసేన పార్టీ పద్నాలుగవ ఆవిర్భావ దినోత్సవం పార్టీ శ్రేణులు ఆధ్యర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవిసెంటర్‌లో గల స్తూపంవద్ద జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ముద్రగడ జెమ్మి, నాగిరెడ్డి రామకృష్ణ, గొల్ల పల్లి శ్రీను, తోరాటి శ్రీను, దామిశెట్టి నాగరాజు (గ్రీన్ ల్యాండ్ బాబీ) తమ్మిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల నుండి శుక్రవారం పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావసభకు అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ ర్యాలీలో నాగిరెడ్డి రామకృష్ణ, కర్రి చిన్న బాబు, ఆకుల మూలరాజు, దుడే శివ, నాగిరెడ్డి భాస్కర్, నాగిరెడ్డి కాశీ, రంకిరెడ్డి చిట్టిబాబు, గంగరాజు రమణ, చింతలపూడి సత్తిబాబు, హనుమంతు శ్రీను, చిక్కాల వంశీ, అన్నందేవుల యాదగిరి, పల్ల డాన్, మద్దినాల సాయి, జిగదాపు విజయ్, వనమాలీ శ్రీను తదితరులు ఉన్నారు.

చేసిన సేవలకు మంచి గుర్తింపు

విశాలాంధ్ర - అనపర్తి : ఉద్యోగిగా తాము పనిచేస్తున్న సమయంలో అందించిన సేవలే మంచి గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పొలమూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నరాలశెట్టి సుబ్బారావు పదవీ విరమణ సందర్భంగా దంపతులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందనలు తెలిపి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమ తులసి, ఎన్డీఏ నేతలు సత్తి దేవదాన రెడ్డి, అధికారులు తదితరులు ఉన్నారు.

తరలిన జనసైనికులు

విశాలాంధ్ర-దేవరపల్లి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు శుక్రవారంపిఠాపురం నియోజకవర్గంలో చిత్రాడ తరలి వెళ్ళటానికి దేవరపల్లి హైవేలో గల డైమండ్ సెంటర్లో పోలవరం చింతలపూడి గోపాలపురం నాయకులు కార్యకర్తలు కార్లలో తరలిరాగా డైమండ్ సెంటర్ వద్ద వాహనాలను జండా ఊపి పోలవరం ఎమ్మెల్యే చిరు బాలరాజు ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలరాజు గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి డి సువర్ణ రాజు, చింతలపూడి ఇంచార్జ్ మేక ఈశ్వరయ్యలు మాట్లాడుతూ ఎంతో చారిత్రాత్మకంగా చిత్రాడలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేడుకలకు చింతలపూడి గోపాలపురం పోలవరం నియోజకవర్గాల నుండి భారీ సంఖ్యలో బస్సులలో చిన్నకారులలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు మనుగుడి రవి మాధవరపు వెంకటేశ్వరరావు , పసుపులేటి శివ నాగ ప్రసాద్, సిద్ధ తాతబ్బాయి, పూలుమాటి నాని, డి ఆనంద ప్రసాద్, మద్దాల కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రజాహిత వెతలపై పవన్ స్పందించాలి

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా మంత్రి, డిప్యూటీ సిఎం జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రజాహిత వెతలపై స్పందించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ఎనిమిది అంశాల ఫ్లెక్సీతో గాంధేయ మార్గంలో నిరసన చేపట్టారు. కాకినాడలో ఎనిమిది గ్రామాల విలీన సమస్యలు, జిల్లా కేంద్రానికి కార్పోరేషన్ ఎన్నికలు, ఆర్థిక సంఘం నిధులు, ముంపునకు గురవుతున్న కాకినాడ సామర్లకోట హైవే కెనాల్స్, ఉప్పుటేరు ప్రక్షాళన, అనారోగ్యకర కోనోకార్పస్ వృక్షాలు తొలగింపు, కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వికేంద్రీకరణ, ప్రసూతి విభాగంలో బెడ్స్ పెంపు, ఉప్పాడ తీరంలో రక్షణగోడ, మడ అడవుల పెంపకం సంరక్షణ, సాల్ట్ భూముల్లో విమానాశ్రయం, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాదికి అన్యాయం జరగకుండా ఎంపి సీట్ల పెంపు పర్యటనల్లో వ్యక్తిగతం కాని వినతిపత్రాల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాటు అంశాలను కోరారు. నిజాయితీగా ప్రశ్నించే ప్రజాస్వామ్య గొంతుకలకు జవాబులు ప్రకటించాలన్నారు. జిల్లాకు ఏకైక మంత్రిగాను డిప్యూటీ సిఎంగా ప్రజాహిత వినతి పత్రాలు స్వయంగా స్వీకరించే ప్రక్రియకు పవన్ పర్యటనల్లో తగిన సమయం కేటాయించక పోవడం వలన అధికారుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి వలన ప్రజాస్వామిక వాదుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని రమణ రాజు పేర్కొన్నారు.

వెదురు సాగుపై నేడు శిక్షణ

విశాలాంధ్ర - రాజానగరం : రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 15న వెదురు సాగు పైరాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి సుజాత కుమారి అన్నారు. ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటన ను శుక్రవారం విడుదల చేశారు.దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ రాజానగరం మండలంలోనీ జివిఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో జాతీయ వెదురు మిషన్ ఆధ్వర్యంలో వెదురుసాగును ప్రోత్సహించేందుకు ఈనెల 15 ఉదయం నుండి సాయంత్రం వరకు రైతులకు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణా తరగతులకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి 15 మంది ఉద్యానవన శాఖ అధికారులు, 100 మంది అభ్యుదయ రైతులు, గ్రామ ఉద్యానవన సహాయకులు తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. సదస్సుకు తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి, రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్.ఏపి. దేవముని రెడ్డి,రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టరు విజయ కుమార్, కొన్బాక్ డైరెక్టరు సంజీవ్ కార్డే, రాష్ట్ర సేరీకల్చర్ -సేల్వి కల్చరిస్ట్ శ్రీనివాసులు, జిల్లా సుక్ష్మసేద్య నీటి సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు ఏ.దుర్గేష్ తదితరులు పాల్గొంటారు.

ఆవిర్భావ సభకు తరలిన జనసైనికులు

విశాలాంధ్ర - సీతానగరం: జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవంకు మండలంలో వివిధ గ్రామాల నుండి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నేతృత్వంలో శుక్రవారం తరలి వెళ్ళిన జన సేనలు. జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి నేడు నిర్వహిస్తున్న 12వ ఆవిర్భావ దినోత్సవం చరిత్రలో నిలిచిపోయే విధంగా కనివిని ఎరుగని రీతిలో జరపడానికి జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు గత కొద్ది రోజులుగా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేశారు. సీతానగరం నుండి జనసేన నాయకులు ఏర్పాటు చేసిన బస్సులను రాజానగరం నియోజకవర్గ జనసేన సినీయర్ నాయకులు గుర్రాల చలం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి జనసేనలు పెద్ద ఎత్తున కార్లు, ద్విచక్ర వాహనాల్లో సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే బత్తుల సైతం సభను విజయవంతం చేయడానికి మండలానికి ఒకో కమిటీని ఏర్పాటు చేసి సభకు జన సైనికులను తరలించే బాధ్యతను అప్పగించారు. ఈ కార్యక్రమంలో జమసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఏకపక్షంగా ఇంటి మెట్లు తొలగింపు

విశాలాంధ్ర - పెదపూడి /బిక్కవోలు : రాకపోకలు సాగించడానికి వీలులేకుండా గుమ్మానికి అడ్డుగా పెట్టిన సిమెంట్ బెంచీని తొలగించాలంటూ అధికారులకు మొర పెట్టుకుంటే.. ఏకపక్షంగా బెంచీతో పాటు ఇంటి మెట్లను తొలగించారు. దీంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే బిక్కవోలు కొత్తపేటలో నివాసం ఉంటున్న అక్రమ్ బాషా ఇంటి ముందు ఇద్దరు పాస్టర్లు, కొంత మంది వ్యక్తులతో కలిసి గత నెల 15వ తేదీన సిమెంట్ బెంచీని అడ్డంగా పెట్టారు. దాన్ని తొలగించాలంటూ బాషా స్థానిక అధికారులతో పాటు కలెక్టర్, జిల్లా ఎస్పీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం ఆకస్మికంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి తన సిబ్బందితో బెంచీని తొలగించారు. దాని వెనుక ఉన్న మెట్లను తొలగిస్తుండగా బాధితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా విచారణ చేయకుండా స్థానికులు ఫిర్యాదు చేశారంటూ ఇంట్లోకి వెళ్లే మెట్లను తొలగించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రోజాను వివరణ కోరగా ఇరు వర్గాల ఫిర్యాదును పరిశీలించిన తర్వాత సమస్య పరిష్కారానికి సిమెంట్ బెంచీ, మెట్లను తొలగించామన్నారు.

రెడ్డి సురేష్ శర్మకు సత్కారం

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు,వేద పండితులు రెడ్డి సురేష్ శర్మకు సువర్ణ కంకణం తొడిగి ఘనంగా సత్కరించినట్లు రెడ్డి సతీష్ తెలిపారు. శుక్రవారం గత ఐదు రోజుల నుండి కర్రి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి వీర కాత్యాయని దంపతుల (అర్తమూరు) ఆధ్వర్యంలో శ్రీ సహస్ర పూర్ణ చంద్ర దర్శన మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో శశాస్త్రయంగా నిర్వహించిన రెడ్డి సురేష్ శర్మని సువర్ణ కంకణం తొడిగి ఘనంగా సత్కరించినట్టు రెడ్డి సతీష్ చెప్పారు. సురేష్ శర్మ మాట్లాడుతూ కంకణ ధారణతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హంపీస్ బౌల్డర్స్, హంపీస్ విస్కర్స్, హంపీస్ ఫెదర్స్ రిసార్ట్స్ అధినేత దాట్ల వెంకటపతి రాజు నీలవేణి దంపతులు,ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ దిగ్గజం కలిదిండి కృష్ణంరాజు విజయలక్ష్మి దంపతులు (యూపీ), వసుధ ఫార్మా కెమ్ లిమిటెడ్ మంతెన వెంకటరామరాజు వరలక్ష్మి దంపతులు, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లికి మాజీ ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పెదపూడి, అనపర్తి : గొల్లల మామిడాడ రామ లక్ష్మణ్ లే అవుట్‌లో గల శ్రీ సత్తెమ్మ తల్లి సంబర మహోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి ప్రభాకర్ రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి (హంస), ద్వారంపూడి వెంకట రెడ్డి, సబ్బెళ్ళ చిన్న, సబ్బెళ్ళ సుధాకర్ రెడ్డి, మండ రాజారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మార్క్స్ వర్ధంతి

విశాలాంధ్ర - కాకినాడ : ఘనంగా కారల్ మార్క్స్ వర్ధంతి రమణయ్యపేటలో అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ 142వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచాన్ని పరిపరి విధాల నిర్వచించడం కాదని దానిని మార్చాలంటూ విప్లవ శంఖం పూరించిన మహా మేధావి కారల్ మార్క్స్ అని అన్నారు. అంతులేని దారిద్యాన్ని, అష్ట కష్టాలను భరిస్తూనే మేధావిగా రచనలు చేయడమే గాక విప్లవకారుడిగా నిరంతరం పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, జి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగోసారి వెలసిన గోడపత్రిక

విశాలాంధ్ర - పెదపూడి : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీసీ చినబాబుపై అవినీతి ఆరోపణల కథ రోజులు గడుస్తున్న ఇంకా కంచికి చేరలేదు. పెదపూడి ఇన్చార్జి ఏపీఎంగా చినబాబు భారీ అవినీతికి పాల్పడ్డాడంటూ గత కొన్ని నెలలుగా గోడ పత్రికలు వెలుస్తున్నా అధికారుల్లో, ప్రజా ప్రతినిధుల్లో చలనం రావడం లేదని పనులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెలుగు కార్యాలయం వద్ద అవినీతిపై విచారణ చేయాలంటూ నాలుగోసారి గోడ పత్రికను అతికించారు. సీసీ చినబాబుపై బదిలీ వేటు పడడంతో మండలంలోని 18 గ్రామాలకు చెందిన 52 మంది డ్వాక్రా యానిమేటర్లతో సోమవారం ఆకస్మికంగా రహస్య సమావేశం నిర్వహించారని ఏపీఎం అరుణకు తెలియకుండా నిర్వహించిన ఈ రహస్య సమావేశంలో ఇప్పటివరకు జరిగిన అవినీతి బయటపడకుండా తీసుకోవాల్సిన చర్యలపై వారికి దిశానిర్దేశం చేస్తూ అందరు ఒక తాటి మీదకు వచ్చి ఒక యూనియన్‌గా ఏర్పడాలన్నారని, నాలుగు రోజుల్లో తాను పెదపూడి నుంచి సామర్లకోట మండలానికి బదిలీపై వెళ్తున్నానని. ఒకవేళ జరిగితే అవినీతి ఎక్కడా బయట పెట్టకూడదు అని యానిమేటర్లతో ప్రమాణం చేయించుకున్నట్టు ఆ పత్రికలో వివరించారు. సీసీ చినబాబు, యానిమేటర్లు చేసిన అవినీతి మీద జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు విచారణ జరిపించి నిరుపేద మహిళలకు న్యాయం చేయాలని కోరారు.

ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో పాల్గొన్న మాసం పౌర్ణమి సందర్భంగా ముఖ్యంగా మహాలక్ష్మి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు ఓకే పానిపట్టంపై విగ్నేశ్వరుడు జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరా చార్యులు మహాలక్ష్మి సరస్వతి ఉండటంతో ప్రత్యేకత ఏర్పడింది పౌర్ణమి సందర్భంగా ఉదయం మహాలక్ష్మికి ఆదిశంకరాచార్యుల వారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు పంచా మృతాభిషేకం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం మహిళా కమిటీ సభ్యులు సౌందర్యలహరి శివానందలహరి పారాయణం చేశారు. ఈ సందర్భంగా పురోహితులు కల్లూరి వెంకట సాయి శర్మ మాట్లాడుతూ పాల్గొన్న పౌర్ణమి రోజు మహాలక్ష్మి జన్మదినం కావటం ప్రత్యేకతను ఏర్పరచుకుందని అన్నారు. పౌర్ణమి సందర్భంగా జగద్గురు ఆదిశంకరాచార్యులకు మహాలక్ష్మి అమ్మవారికి సరస్వతి అమ్మవారికి విధ్యాషులకు అభిషేకాలు నిర్వహించినట్లు తెలిపారు. మే రెండో వారంలో పంచభూత లింగ క్షేత్రాలను సందర్శించి శివానందలహరి పారాయణ తమ మహిళా కమిటీ సభ్యులు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు కల్లూరి వెంకట సాయి శర్మ ధ్యాన మందిరం అభివృద్ధి కమిటీ చైర్మన్ చలంచర్ల వీర వెంకట హరినాథ్ ఉపాధ్యక్షుడు నారాయణ విశ్వేశ్వరరావుప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ సహాయ కార్యదర్శి చెరవూరి సత్యనారాయణ గౌరవ సలహాదారు విష్ణుభట్ల రామారావు మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు అభిషేకం

విశాలాంధ్ర - కాత్రేనికోన : గెద్దనపల్లి గ్రామ శివారు చింతల మెరక గ్రామంలో శ్రీ విజయలక్ష్మి దుర్గ అమ్మవారి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా దుర్గమ్మకు పంచామృత అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు చేసి భక్తి శ్రద్ధలతో కొలిచారు. ఆలయ పురోహితులు ఆకొండి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ ఆలయం వద్ద ప్రతినెల పౌర్ణమి నాడు అభిషేకం జరిపిస్తామని భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

దుర్వాసన నుంచి విముక్తి కలగదా?

విశాలాంధ్ర - జగ్గంపేట: మురుగునీరు దుర్వాసన నుంచి మమ్మల్ని విముక్తుల్ని చేయండి మహా ప్రభో ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రమైన జగ్గంపేట అన్నపూర్ణ పౌల్ట్రీ కాంప్లెక్స్ కాలనీ వాసులు. గత కొన్నేళ్ళుగా వారు మురుగునీరు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు పోయేలా చేయాలని కాలనీ వాసులు అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఐతే ఇది రెండు మండలాల్లోని రెండు గ్రామాల సమస్యగా మారడంతో పరిష్కారం కావడంలేదని తెలుస్తోంది. జగ్గంపేట నుంచి గోకవరం వెళ్ళే రహదారిలో సెంటర్ మొదలుకుని పోలవరం కాలువ వరకు రోడ్డుకు ఒక వైపు గండేపల్లి మండలం లోని నీలాద్రిరావుపేట పరిధిలోనికి వస్తుంది. ఇక రోడ్డుకు మరో ప్రక్క నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట పరిధిలోకి వస్తుంది. అలా ఉన్న రోడ్డులో ఒక ప్రక్క నీలాద్రిరావుపేట గ్రామ రెవెన్యూ పరిధిలో రెండు కళ్యాణ మండపాలు, ఒక లాడ్జి ఉన్నాయి. వారు వినియోగించిన నీరు కాస్తా వాసుదేవనగర్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న కల్వర్టు నుంచి రోడ్డు దాటి జగ్గంపేట పరిధిలోకి వస్తుంది. అలా వచ్చిన మురుగునీరు అన్నపూర్ణ పౌల్ట్రీ కాంప్లెక్స్ వద్ద నిలిచిపోతుంది. ముందుకు వెళ్ళే మార్గం లేక అక్కడే నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఫంక్షన్ హాల్స్ వారు వాడే నీరు పోయే మార్గం లేక దుర్వాసన వస్తుందని, మేము నివశించలేక పోతున్నామన్నారు. గతంలో స్థానిక అధికారులకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా నీరు పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జుత్తుక నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ అండ్ బి రహదారిని ఆక్రమించుకుని భవనాలు నిర్మించుకోవడంతో మురుగు నీరు పోయే మార్గం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి నీరు పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

24, 25న ఎస్‌బీఐ బ్యాంక్ బంద్

విశాలాంధ్ర - గండేపల్లి : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ రాజమహేంద్రవరం మాడ్యూల్ తుని రీజియన్ రీజనల్ కమిటీ మీటింగ్ శుక్రవారం గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారు పరిణయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. Lq vvl7తుని రీజియన్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్బిఐ, ఎస్ యూఏసి, ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్, నేషనల్ కాన్ ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ, యునైటెడ్ ఫోర్మ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ కన్వీనర్ ఎల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులో సిబ్బంది సరిపోక పూర్తిస్థాయిలో ఖాతాదారులకు సేవలందించలేకపోతు న్నామన్నారు. ఈ నెల 24, 25న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులపాటు బ్యాంకులు బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ బంద్‌కు ఖాతాదారులు సహకరించాలని కోరారు. గౌరవ అతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ప్రెసిడెంట్ ఆర్ నరేంద్ర కుమార్, రాజమహేంద్రవరం మాడ్యూల్ వైస్ ప్రెసిడెంట్ పేరిశాస్త్రి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి పాపారావు, ఏజిఎస్‌కే శ్రీనివాసరావు, ఏజిఎస్ జెఎస్ చంద్రశేఖర్, తుని రీజియన్ అధ్యక్షులు ఎల్ విజయబాబు హాజరయ్యారు. ముందుగా ఆదిత్య ఆసుపత్రి నుంచి ముఖ్య అతిథులను కామ్రేడ్స్ ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ తీన్మార్ డప్పులు, బాణాసంచా పేలుళ్ల మధ్య ఫంక్షన్ హాలుకు తీసుకువచ్చారు. ఈ సమావేశంలో సభ్యుల సమస్యలు, ఇబ్బందులు బ్రాంచ్ లోకల్ సెక్రటరీల తెలుసుకున్నారు. మెంబర్లను ఉద్దేశిస్తూ యూనియన్ భవిష్యత్తు కార్యాచరణపై మాట్లాడారు. తుని రీజియన్ ఇన్చార్జిగా విధులు నిర్వహిస్తున్న క్రొవ్విడి శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిన జనసైనికులు

విశాలాంధ్ర - రాజానగరం : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పిఠాపురం మండలం లోని చిత్రాడ లో ఏర్పాటు చేసిన సంగతి పాఠకులకు విదితమే. దీనిలో భాగంగా జనసేన ఆవిర్భావ సభకు రాజానగరం మండలంలోని వివిధ గ్రామాల నుండి జనసైనికులు,వీర మహిళలు శుక్రవారం తరలివెళ్లారు.నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ ఆదేశాలు మేరకు భారీగా వెళ్ళారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో భాగంగా జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలి బహిరంగ సభ కావడంతో నాయకులు,కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో తరలి వెళ్ళారు. అలాగే మండల కేంద్రమైన రాజానగరం బస్టాండ్ వద్ద జనసైనికులు కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. సూర్యారావుపేట వద్ద బస్సులకు పచ్చాజెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అలాగే వివిధ గ్రామాల నుంచి జనసేన నేతలు పెద్ద ఎత్తున కార్లు, ద్విచక్ర వాహనాల్లో సభ ప్రాంగణానికి ఉదయం నుండి బయలు దేరారు. దీంతో రాజానగరం నుండి ఏడీబి రోడ్డు, జాతీయ రహదారి సందడి వాతావరణం నెలకొంది.

అదనపు తరగతి ప్రారంభం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మెర్లపాలెం శివారు వాసంశెట్టివారిపాలెంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.24 లక్షలతో నిర్మించిన అదనపు గదుల నిర్మాణాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన నిధులను గ్రామస్థులు సేకరించి పనులు పూర్తి చేసి పాఠశాలను సిద్ధం చేసిన వారిని అభినందించారు. పాఠశాలకు అవసరమైన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని, పనులు పూర్తి చేస్తామని సత్యానందరావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీ సత్యనారాయణరెడ్డి, ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), గుత్తుల రాంబాబు, చిలుపూరి సతీష్‌రాజు, అయినవిల్లి సత్తిబాబుగౌడ్, మెర్లరాము, మలవరపు నాగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి పూజలు

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. హోలీ పండుగ రోజు లక్ష్మీదేవి జయంతి కావడంతో ఆమె అనుగ్రహం కోసం గ్రామంలోని మహిళలతో కలిసి టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి అమ్మవారిని పూజించారు. లక్ష్మీదేవికి రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు దంపతులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దాట్ల సురేష్ రాజు, గెద్దమూరి బాబ్జి, పిటి ప్రసాద్ అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

17న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈనెల 17న సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌లో హెల్మార్క్స్ గ్లోబల్ టెక్నాలజీస్ కంపెనీలో జూనియర్ అకౌంటెంట్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు బీకాం, ఎంకామ్, ఎంబీఏ, (సిఏ ఇంటర్) ఉత్తీర్ణులైన ఫ్రెషర్స్, ఎక్స్‌పీరియన్స్‌డ్, టాలీ, అకౌంటింగ్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో అవగాహన ఉన్న పురుష అభ్యర్థులు అర్హులు. మెన్సెన్ ఫార్మా లిమిటెడ్లో మెడికల్ రిప్రెజెంటేటివ్, నిట్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్లో అసిస్టెంట్ మేనేజర్, ఇండో ఎంఐఎం, హోండాయ్ మోబిస్, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. అలాగే డియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యో గాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ ఓ బి టెక్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్య ర్థులందరూ ఈ నెల 17 'వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకి నాడ' వద్ద ఉదయం 9గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్సుతో హాజరు కావలెను. వివరాలకు 7799376333, www.vikasajobs.com సంప్రదించవలెను.

మహాజనసభ సమావేశపు నోటీసు

ది. గౌతమీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ లిమిటెడ్ నెం. డి. 1440, రాజమండ్రి వారి మహాజన సభ సమావేశము ది. 28-03-2025వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3.00గం॥లకు సూపరుబజారు కార్యాలయమునందు అఫిషియల్ పర్సన్ ఇన్చార్జి ఎం. కనకదుర్గారెడ్డి గారి అధ్యక్షతన జరుపబడును. కావున సంఘ సభ్యులు ఎల్లరు సదరు సమావేశమునకు హాజరు కావలసిందిగా కోరడమైనది.

ఎం. కనకదుర్గారెడ్డి, అఫిషియల్ పర్సన్ ఇన్చార్జి,
ది. గౌతమీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ లిమిటెడ్,
నెం. డి. 1440 - రాజమండ్రి

రాజమహేంద్రవరం
ది. 28-02-2025

వివాహవేడకల్లో ముదునూరి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ధర్మవరం గ్రామంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళి రాజు శుక్రవారం పర్యటించారు. పలువురు వైసీపీ శ్రేణులు అభిమానులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో రెడ్డిపల్లి పెద్దకాపు కుమారుడు రాజేష్ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే గ్రామానికి చెందిన బుర్ర నాగేశ్వరరావు కుమారుడు వీరబాబు నూతన గృహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, చేకూరి రాంబాబు రాజు, చేకూరి ప్రసాద్ రాజు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరావు, దాడి పుత్రయ్య, కోలా తాతబాబు, నల్ల వెంకటేష్, కేసరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - కాళ్ల : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కాళ్ళ మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత జెండా ఆవిష్కరణ చేసి, అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సారధ్యంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కూటమి ప్రభు త్వం ఏర్పాటుకు కళ్యాణ్ చేసిన కృషి ఎంతో ఉందన్నారు. అనం తరం పిఠాపురం నియోజక వర్గం లోని చిత్రాడలో నిర్వహిస్తున్న జనసేన పార్టీ ఆవిర్భావసభకు మండలం నుంచి 6 బస్సులు, 20 కార్లు, 100 బైకులపై పార్టీ శ్రేణులు తరలి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆరేటి దిలీప్ కుమార్, బందారు సోమేశ్వ రరావు, గడి రాము, కొప్పర్తి ఆదిత్య, ఓగిరాల రాజేష్, పెంట పాటి నాగేశ్వరరావు, వీరమల్లు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిన నేతలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ సభకు ముదినేపల్లి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలోని సింగరాయపాలెం నుండి జనసేన మండల అధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఏ ఎన్ బాబు, కె.నానాజీ , సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, యార్లగడ్డ గంగయ్య , వడ్లాని ఆంజనేయులు , కార్యకర్తలు తరలివెళ్లారు.

జోరుగా బెల్ట్ షాపులు

ఉక్కుపాదం ప్రకటనలకే పరిమితమా?

విశాలాంధ్ర - సీతానగరం: బెల్ట్ షాపులపై ఉక్కుపాదం ప్రకటనలకే పరిమితమా అంటూ ప్రశ్నిస్తున్న ప్రజలు. రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వంలో లిక్కర్ అమ్మకాలలో జరిగిన పొరపాట్లు మరల పునరావృతం కాకుండా పక్క ప్రణాళికతో లిక్కర్ షాపులను వేలంపాట ద్వారా నిర్ణయించారు. కల్లు గీత కార్మికులకు ప్రత్యేక రాయితీ ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని షాపులను కేటాయించిన సంగతి అందరికీ తెలిసిందే. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే తాటతీస్తామంటూ ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ చర్యలు ఎక్కడా కనపడటం లేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు రెండు షాపులు వేలంపాట ద్వారా కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు చేయూతనిస్తూ మరొక షాపును కేటాయించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా 21 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామానికి రెండేసి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు నుంచి ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అలాగే ఈ షాపులకు మద్యం అందించడంలో ప్రభుత్వం అనుమతులు పొందిన కొన్ని షాపుల యజమానులు పరోక్షంగా సహకరిస్తున్నట్టు పెద్ద ఎత్తున ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ బెల్టు షాపుల వల్ల గ్రామాలలో కూలీలుగా జీవనం సాగిస్తున్న వారు ఒక్కో మద్యం సీసాకు అదనంగా 20 నుండి 50 రూపాయలు అధికంగా చెల్లించి తమ ఇళ్లను గుల్ల చేస్తున్నారంటూ మహిళలు ఆరోపిస్తున్నారు. పురుషోత్తపట్నం గ్రామం నుండి ఉండేశ్వరపురం గ్రామం వరకు ప్రతి గ్రామంలోని కుటీర పరిశ్రమల వల్లే బెల్ట్ షాపులు వర్ధిల్లుతున్నాయని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ బెల్ట్ షాపులపై సంబంధిత శాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టి తమ ఇళ్లను గుల్ల కాకుండా, సిఎం ఆదేశాలను అధికారులు నిలబెట్టాలని మహిళలు కోరుతున్నారు.

కందికుప్ప రోడ్డుకు మోక్షం...తీరిన ప్రజల కష్టాలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : కూటమి ప్రభుత్వం రాకతో ఎన్నో ఏళ్ల నాటి రోడ్డుకు మోక్షం కలిగింది. మండలంలోని కందికుప్ప సెంటర్లో ఆర్ అండ్ బి రోడ్డును ఇటీవల అభివృద్ధి చేయడంతో పలు గ్రామాల ప్రజల సమస్య తీరింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చొరవతో దాదాపు రూ.30 లక్షలు మంజూరు కావడంతో ఇక్కడ రోడ్డుకు పడిన గండిని పూడ్చి సీసీ రోడ్డుగా తీర్చిదిద్దారు. రోడ్డు ఇరుపక్కల గ్రావెల్తో బెర్మ్ నిర్మించడంతో ప్రజల కష్టాలు తీరాయి. కొన్ని సంవత్సరాలుగా ఏ చిన్నపాటి వర్షం వచ్చినా కందికుప్ప సెంటర్లో రోడ్డు దిగబడి చెరువులా మారడంతో మోకాలులోతు మురుగునీటిలో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ఇక్కడ తరుచు ప్రమాదాలు జరిగేవి. ఈ సమస్యను ఎన్నిసార్లు విన్నవించినా నిధుల లేమి వల్ల గత ప్రభుత్వంలో పాలకులు నిర్లక్ష్యం వహించారనే చెప్పాలి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎన్నికల హామీగా నిలిచిన కందికుప్ప రోడ్డు సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే దాట్లను స్థానికులు అభినందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో తమ సమస్య తీరిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర -పెంటపాడు : ప్రకృతి వ్యవసాయం వలన నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వ్యవసాయ ఏడిఏ పి.మురళీకృష్ణ అన్నారు. పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయదారుడు జాలపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ ఏడిఏ పి.మురళీకృష్ణ,పెంటపాడు ఎంఏఓ కే.పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అనగా రసాయన ఎరువులు,పురుగుమందులు, జన్యుపరమైన మార్పు చేయబడిన విత్తనాలు లేకుండా, సహజ పద్ధతిలో వ్యవసాయం చేయడం వలన, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, నీటిని ఆదా చేయవచ్చని, తద్వారా పంటల వైవిధ్యం పెరిగి, పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. కాబట్టి రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, మానవ మనుగడకు సహకరించాలని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు ఆకుతీగపాడు బాబు,ఎంపీటీసీ సభ్యులు కొణతాల వెంకట్రావు, ఆకుతీగపాడు నీటి సంఘం అధ్యక్షులు మొఖమాట్ల సూర్యచంద్రం, ఉప సర్పంచ్ కొల్లూరి పండు, రైతులు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణ వైసీపీ నూతన అధ్యక్షుడిగా చిట్టూరి

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా చిట్టూరి అన్నవరం ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కొవ్వూరు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొవ్వూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తలారి వెంకట్రావు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కొవ్వూరు మున్సిపల్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని కొవ్వూరు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా చిట్టూరి అన్నవరం ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ కోడూరు శివరామకృష్ణ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కంటమణి రమేష్ బాబు, నియోజకవర్గం అధికారిక ప్రతినిధి గంధం సాయి పత్తి నాగరాజు కొవ్వూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అంకోలు లిల్లీ వెంకట పద్మలీల , చీర అరుణ చొప్ప అప్పలనాయుడు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి పండితుల ఆశీర్వచనాలు

విశాలాంధ్ర- పాలకోడేరు : ఇటీవల నరసాపురం పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ కి వాహన ప్రమాదం జరిగి ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా క్షేమంగా తిరిగి రావడంతో పాలకోడేరు మండలం గొల్లల కోడేరు గ్రామానికి చెందిన దర్భా అచ్యుతరామ సిద్ధాంతి, మెట్ల గోపాల శర్మ శుక్రవారం హోలిక పూర్ణిమ సందర్భంగా మహంకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి, లలిత త్రిపుర సుందరి అమ్మవార్లకు మంగల చండీ హోమం జరిపించి తదనంతరం అమ్మవారి ప్రసాదాన్ని కేంద్ర మంత్రివర్యులు భూపతి రాజు శ్రీనివాసరాజు గారికి అందజేశారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ ఈమధ్య మంత్రివర్యులకు వాహన ప్రమాదం జరిగినప్పటికీ ఏ విధమైన నష్టం జరగకపోవడం అంత అమ్మవారి అనుగ్రహం అని భవిష్యత్తులో మంత్రివర్యుల ఆరోగ్యం బాగుండాలని, ఆయన తొందరగా కోలుకొని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆశీర్వాదాలు అందించినట్లు తెలిపారు. బిజెపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు